
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 14 । డిసెంబర్ । 2023



సోమశిలలో 36.137 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో బుధవారానికి 36.137 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఫైతట్టు ప్రాంతాల నుంచి 1,371 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.62,980
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,656
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,826
నవర (8 గ్రాములు)	రూ.46,608

గరిష్టం/కనిష్టం
29.9 /22.6

వాతావరణం
బుధవారం వాతావరణంలో తేమ 67 శాతం ఉంది. గురువారం ఎండ తీవ్రత తక్కువగా ఉంటుంది. చలిగాలులు వీచే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

రేపు ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈ నెల 15న ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అక్బర్‌అలీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 3న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించాల్సి ఉండగా మిచాంగ్ తుఫాన్ కారణంగా వాయిదా వేసినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పొదలకూరు రోడ్డులోని జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, సంఘాల నాయకులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆర్టీసీలో ప్రీ బిడ్డింగ్ సమావేశం



మాట్లాడుతున్న ఆర్‌ఎం శేషయ్య

నెల్లూరు సిటీ: నెల్లూరు జోన్–3 పరిధిలోని 15 ఖాళీ స్థలాలను 15 ఏళ్ల లీజుకు తీసుకొనేందుకు వచ్చిన 11 మంది ఆశావహులతో ఏపీఎస్‌ఆర్టీసీ ఆర్‌ఎం శేషయ్య బుధవారం ప్రీ బిడ్డింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషయ్య మాట్లాడుతూ లీజుకు సంబంధించి విధి విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు



మాట్లాడుతున్న ఎస్‌ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ తెలిపారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ పొదుపు చర్యలు పాటించడం పరోక్షంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయడమేనని తెలిపారు. 5 స్టార్ రేటింగ్ కలిగిన విద్యుత్ ఉపకరణాలను వినియోగించడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయవచ్చని వివరించారు. భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇంధన పొదుపు ఆవశ్యకతపై వారం రోజుల పాటు జిల్లాలోని వినియోగదారులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో వినియోగదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ హాకీ పోటీలకు మౌనిక



ఎస్ మౌనిక

పొదలకూరు : స్థానిక డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎస్ మౌనిక అండర్–14 జాతీయ హాకీ పోటీలకు ఎంపికైంది. స్కూల్ గేమ్స్‌లో భాగంగా మదనపల్లిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని సునంద తెలిపారు. ఈనెల 25న మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో నిర్వహించే జాతీయ పోటీల్లో మౌనిక పాల్గొంటుందని వెల్లడించారు. ఈ సందర్భంగా మౌనికను పాఠశాల పీసీ చైర్మన్ పీ సురేఖ బుధవారం అభినందించారు.

రాష్ట్ర వైఎస్సార్ విద్యార్థి విభాగంలో జిల్లా వాసులకు చోటు

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వైఎస్సార్ విద్యార్థి విభాగంలో జిల్లాకు చెందిన ముగ్గురికి చోటు లభించింది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన గంగుల మనోహర్ యాదవ్‌ను జిల్లాతో పాటు పల్నాడు, బాపట్ల, ప్రకాశం, తిరుపతి జిల్లాల ఇన్‌చార్జిగా నియమించారు. రాష్ట్ర కార్యదర్శిగా అవుల తులసీయాదవ్, సంయుక్త కార్యదర్శిగా గోసుల రాజశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు.

అందుకే.. మళ్లీ జగనే కావాలి



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు సానా అమరావతి. పొదలకూరు మండలం మొగళ్లూరు గ్రామానికి చెందిన మహిళ. ఈమెకు ఈ ఏడాది నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం కింద పక్కా ఇల్లు మంజూరైంది. ప్రభుత్వం అందజేసే రూ.1.80 లక్షలకు మరికొంత నగదు పోగు చేసుకుని ఇంటిని చక్కగా నిర్మించుకుంది. గతంలో ఇల్లు లేక ఇబ్బందులు పడేవారు. జగన్ ప్రభుత్వంలో తాము పక్కాఇల్లు నిర్మించుకున్నామని ఆయన మేలు మరచిపోలేమని అమరావతి చెప్పారు. ప్రభుత్వం అందజేసిన నగదు, మెటీరియల్‌తో పాటు తాము కష్టపడి కొంతనగదు పోగు చేసుకుని ఇంటిని నిర్మించుకున్నట్టు తెలిపారు. –పొదలకూరు



ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఉన్నత చదువులు



అల్లూరులోని ఆర్డీఆర్ కాలనీకి చెందిన పీ సుధాకర్, పీ సునీత దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు. ఎస్టీ కులానికి చెందిన నిరుపేదలైన సుధాకర్ దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక స్థోమత లేక కుమార్తె మమతను డిగ్రీ వరకు చదివించి మాన్పించారు. కుమారులను కూలీ పనులకు పంపకుండా కష్టపడి చదివిస్తున్నారు. జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడితో చిన్న కుమారుడు శ్రీనాథ్ పదోతరగతి, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పెద్దకుమారుడు అజయ్ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఆర్థిక భారం లేకుండా తమ ఇద్దరు కుమారులు చదువుకుంటున్నారని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. –అల్లూరు



సంక్షేమ పథకం	లబ్ధిదారులు	నగదు లబ్ధి (రూ.కోట్లలో)
ఆసరా	3,24,899	999.49
అమ్మఒడి	2,41,819	1062.48
రైతు భరోసా	2,44,757	1163.60
ఈబీసీ నేస్తం	31,706	86.35
హౌసింగ్ (డీబీటీ)	49,792	471.92
జగనన్న వసతిదీవెన	1,25,894	218.91
జగనన్న విద్యాదీవెన	1,59,577	570.09
మత్స్యకార భరోసా	19,329	58.00
నేతన్న నేస్తం	5,131	41.90
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	89,440	417.81
వైఎస్సార్ చేయూత	1,47,975	647.36
పింఛన్ కానుక	3,72,789	3,574.62
జగనన్న తోడు	94,832	176.56

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యానికి బాటలు వేశారు. విద్యవైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారు. సామాజిక సాధికారతే లక్ష్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇస్తున్నారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ పాలన సాగిస్తున్నారు. అందుకే రాష్ట్రానికి మళ్లీ జగనే సీఎం కావాలంటూ జిల్లా ప్రజలు నినదిస్తున్నారు.

మాటల్లో చెప్పలేని సంతోషం



నా వయస్సు 55 ఏళ్లు. డప్పు కళాకారుడిని. గతంలో పెన్షన్ కోసం ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి కాళ్లు అరిగిపోయాయి. ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వలంటీర్లు, సచివాలయ అధికారులు ఇంటికొచ్చి మరీ పెన్షన్‌కు పేరు నమోదు చేసుకున్నారు. నమోదు చేసుకున్న నెల తరువాత నుంచే రూ.3వేలు పెన్షన్ అందిస్తున్నారు. మాటల్లో చెప్పలేనంత సంతోషంగా ఉంది.
కే కృష్ణయ్య, 12వ వార్డు, నెల్లూరు

- పేదరికమే ప్రామాణికంగా పథకాలు
- పారదర్శకంగా గడప గడపకు చేరవేత
- ప్రతి కుటుంబంలో ఇద్దరు..ముగ్గురికి లబ్ధి
- మెరుగుపడిన పేదల జీవన ప్రమాణాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల పంపిణీలో జన్మభూమి కమిటీలదే ఇష్టారాజ్యం. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత రాజకీయ సిఫార్సులు లేకుండానే అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమచేస్తున్నారు. గడిచిన నాలుగున్నరేళ్ల సుపరిపాలనలో నిరుపేదల కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. పేద, మధ్య, ఎగువ తరగతి వర్గాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయి. అభివృద్ధి అంటే భవంతులు కట్టడమొక్కటే కాదని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం కూడా అభివృద్ధే అని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్త భాష్యం పలికింది. పార్టీ, వర్గం, కులం, మతం చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని అందించడమే సుపరిపాలన అని నిరూపించింది. ఈ విషయాన్ని గుర్తించిన ప్రజానీకం జగన్ సారథ్యంలోని ప్రభుత్వం మరోసారి రావాలని బలంగా ఆకాంక్షిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో అన్ని అర్హతలు ఉన్నా సంక్షేమ పథకాలు పొందాలంటే కనీసం 10 శాతం కమీషన్‌ను అనివార్యంగా జన్మభూమి కమిటీలకు ముట్టజెప్పాల్సి వచ్చేది. ఈ పరిస్థితులతో సామాన్య ప్రజలు విసిగిపోయారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందుకు భిన్నంగా సంక్షేమ పథకాల అమలు తీరును చూసి ప్రజలే ముచ్చటపడుతున్నారు. గడప ముంగిటకే సంక్షేమ పథకాలు వచ్చి చేరుతుండడంతో ప్రతి పేదవాడు మళ్లీ జగనే ఎందుకు రావాలో బలంగా చెబుతున్నారు. వ్యవసాయాధారమైన జిల్లాలో ప్రతి రైతు కుటుంబానికి లంచాలు లేకుండా రైతుభరోసా ఖాతాల్లో జమవుతోంది. పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు పడే కష్టాలను అమ్మఒడి గట్టెక్కిస్తోంది. ప్రతి నెలా ఒకటో తేదీ నాడు కోడి కూయక మునుపే వలంటీర్ తలుపు తట్టి పింఛన్ చేతిలో పెడుతుండడంతో వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారులంతా మురిసిపోతున్నారు. అనారోగ్యమొస్తే ఆరోగ్యశ్రీ కార్డుతో ధైర్యంగా ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొంది తిరిగి వస్తున్నారు. ఇలా ఒకటా రెండా 33కి పైగా పథకాలతో ప్రజల హృదయాలను ప్రభుత్వం గెలుచుకుంటోంది. జగన్ ప్రభుత్వమే మళ్లీ రావాలంటూ దీవెనలందుకుంటోంది.

సానుకూల స్వాగతం

సంక్షేమ పథకాలకే ప్రభుత్వం పరిమితం కాలేదు. బడుగు, బలహీనవర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సామాజిక సాధికారత కల్పించడం తన బాధ్యతగా భుజాన వేసుకుంది. అన్నింటా వారికి అగ్రతాంబూలం వేస్తూ ఆయా వర్గాల్లో సంతోషాన్ని నింపుతోంది. వివిధ పదవుల్లో ఉన్నత వర్గాలకు మించి స్థానం కల్పించి సామాజిక గౌరవాన్ని పెంచుతోంది. జగనే ఎందుకు కావాలంటే తమ సామాజిక సాధికారితే ఇందుకు బదులిస్తుందని బడుగు బలహీన వర్గాలు గట్టిగా చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే నాలుగున్నరేళ్ల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గణాంకాలను వివరిస్తూ రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్ అవసరాన్ని తెలియజేసే 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ప్రజల అవసరాలపై ప్రత్యేక శ్రద్ధ

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



బ్రహ్మదేవిలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి

ముత్తుకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజల అవసరాలు, మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బ్రహ్మదేవి పంచాయతీలో రూ.5.71 కోట్లతో చేపట్టిన సీసీరోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా, ఆర్వో ప్లాంట్, తదితర పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మదేవి పంచాయతీలో నాలుగేళ్లలో రూ.16.16 కోట్ల మేర పనులు పూర్తి చేశామని తెలిపారు. తాము ఓట్ల కోసం శంకుస్థాపనలు చేయడం లేదని అన్నారు. గతంలో చేపట్టిన పనులను మాత్రమే ప్రారంభిస్తున్నామన్నారు. రాష్ట్రంలో టీడీపీ పూర్తిగా కనుమరుగైపోయిందన్నారు. చంద్రబాబు కలలు నెరవేరేదిలేదన్నారు. ఆయన తనయుడికి భవిష్యత్తు లేదన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి అవుతారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధికి రోల్‌మాడల్‌గా నిలిచిందన్నారు. అయితే సోమిరెడ్డి మాత్రం బెదిరింపులకు దిగడం, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడడం, దళిత మహిళా ఉద్యోగిని తూలనాడడం, వ్యాపారాలు చేసుకోవడానికే పరిమితమయ్యాడని ఎద్దేవా చేశారు.

పొట్టింపాడులో గోదాము ప్రారంభం

పొట్టింపాడులో కృష్ణపట్నం సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన 500 టన్నుల సామర్థ్యం కలిగిన నూతన గోదామును మంత్రి కాకాణి ప్రారంభించారు. అనంతరం రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. యువకులకు క్రీడా పరికరాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నెల్లూరు శివప్రసాద్, నాయకులు మునుకూరు రవికుమార్‌రెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ సుధాకర్, ఎంపీటీసీ సభ్యులు ఉప్పల హైమావతమ్మ, మల్లిక బ్రహ్మయ్య, మాజీ సర్పంచ్‌లు పల్లంరెడ్డి జనార్దన్ రెడ్డి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు కేంద్ర బృందం రాక

- తుఫాన్ నష్టాలపై పరిశీలన

నెల్లూరు(దర్గామిట్ట): మిచాంగ్ తుఫాన్ నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర హోంశాఖ, జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారి రాజేంద్ర రాట్ను అధ్యక్షతన వ్యవసాయ, ఆర్థిక, విద్యుత్, రవాణా, గ్రామీణాభివృద్ధి శాఖలకు చెందిన అధికారుల బృందం గురువారం ఉదయం 11 గంటలకు జిల్లాలో పర్యటించనుంది. తొలుత కోవూరు మండలం ఇనమడుగు, లేగుంటపాడు, వేగూరు, ఇందుకూరుపేట మండలం పల్లెపాడు, జగదేవిపేట, కొత్తూరు, ముత్తుకూరు మండలంలోని పంటపాళెం, నిడిగుంటపాళెంలో తుఫాన్ నష్టాలను పరిశీలించనున్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 2.50 గంటలకు వెంకటాచలం మండలం పుల్లతీగపాడు, 3.05 గంటలకు నెల్లూరురూరల్ నియోజకవర్గంలోని సౌత్‌మోపూర్ ప్రాంతంలో దెబ్బతిన్న కనుపూరు కెనాల్‌ను పరిశీలిస్తారు. 3.20 గంటలకు ములుముడి–తాటిపర్తి రోడ్డును పరిశీలిస్తారు. కేంద్ర బృందానికి తుఫాన్ నష్టాలను జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ వివరించనున్నారు. సాయంత్రం 4 గంటలకు కేంద్ర బృందం నెల్లూరు నుంచి బయలుదేరి వెళుతుంది.

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ప్రోత్సాహం

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరురూరల్: వ్యవసాయ రంగానికి ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సాహాన్ని అందిస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. రూరల్ మండలం సౌత్‌రాజుపాళెం, వావిలేటిపాడు ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నారుమడులు దెబ్బతిన్న రైతులకు 80 శాతం సబ్సిడీపై వరి విత్తనాలను బుధవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. రైతులు సుభిక్షంగా ఉంటేనే రాష్ట్రం ఎంతో బాగుంటుందన్నారు. జిల్లాలోని రైతాంగం వారి సమస్యలను వ్యవసాయశాఖ అధికారులకు తెలిపితే పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడుతారన్నారు. రూరల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో వర్షాలకు నష్టపోయిన రైతులకు తగిన విధంగా తోడ్పాటును అందిస్తామని తెలిపారు. జేడీఏ సత్యవాణి, ఏడీఏ శ్రీనివాసులు, రూరల్ ఏఓ నాగమోహన్, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో అక్రమార్కులు



ప్రభుత్వ వైద్య కళాశాల భవనం

- ఉద్యోగాలకు రేటు కట్టి భారీ మొత్తంలో వసూలు
- ఫిర్యాదులు రావడంతో విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
- నేడు, రేపూ డిప్యూటీ డైరెక్టర్ విచారణ

నెల్లూరు సిటీ: నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కొందరు అధికారులు, సిబ్బంది అక్రమాల బాట పట్టారు. ఉద్యోగావకాశాల కల్పనలో అడ్డదారులు తొక్కారు. అర్హత కలిగిన వారికి ఉద్యోగాలు కల్పించాల్సి ఉండగా వాటికి రేటు కట్టి భారీ మొత్తంలో నగదు ఇచ్చిన వారికే ప్రాధాన్యత ఇచ్చారు. ఇద్దరు అధికారులతో పాటు కొందరు సిబ్బందిపైన రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో విచారణకు ఆదేశించింది. ఈ నెల 1న కడప జీజీహెచ్ డిప్యూటీ డైరెక్టర్‌ను విచారణాధికారిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అసిస్టెంట్ డైరెక్టర్ సునీత పురుషోత్తమ్, సీనియర్ అసిస్టెంట్ బీఎల్ఎన్ ఆచార్యలతో పాటు మరో 46 మంది సిబ్బందిని రెండ్రోజుల పాటు విచారణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో విచారణ సమయంలో అధికారులు, సిబ్బంది సెలవుపై వెళ్లేందుకు వీల్లేదని జీజీహెచ్ సూపరింటెండెంట్ సిద్దానాయక్ ఆదేశాలు జారీ చేశారు.

విచారణ చేయనున్న అంశాలు

2020 ఆగస్టు 19న చిత్తూరు నుంచి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతిపై నెల్లూరు మెడికల్ కళాశాలకు బదిలీపై సునీత పురుషోత్తమ్ వచ్చారు. ఈ క్రమంలో 2022లో ఉద్యోగ నియామకాల్లో అక్రమాలకు తెరతీశారని ఫిర్యాదులు వచ్చాయి. అర్హత లేని ఓ వ్యక్తికి జిల్లా అకౌంట్స్ ఆఫీసర్‌గా ఉద్యోగం కల్పించారని సమాచారం. అదే విధంగా 500 మందికి వివిధ విభాగాల్లో ఉద్యోగాలు కల్పించారు. వారి వద్ద నుంచి భారీగా లంచాలు తీసుకుని ఉద్యోగాలు కల్పించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఆమె గతంలో చిత్తూరు జిల్లాలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తున్నప్పుడు పలు అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే ప్రభుత్వానికి చెల్లించాల్సిన హెచ్ఆర్ఏ దాదాపు రూ.5 లక్షలు కట్టలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇన్‌కమ్ ట్యాక్స్‌లో కూడా ప్రభుత్వ భవనంలో ఉంటూ అద్దె భవనంలో ఉన్నట్లు హౌస్ రెంట్ రిసిప్ట్ జత చేశారని సమాచారం. సీనియర్ అసిస్టెంట్ నరసింహాచార్యులు కూడా ఇన్‌కమ్ ట్యాక్స్‌లో అద్దె చెల్లిస్తున్నట్లు రిసిప్ట్‌లను సృష్టించారని తెలిసింది.

గతంలో జరిగిన నియామకాలపైనే ఫిర్యాదులు



నేను ఈ ఏడాది అక్టోబర్‌లో ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించాను. గతంలో జరిగిన నియామకాలకు సంబంధించి నాకు ఏమీ తెలియదు. నేను బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి నియామకాలు పారదర్శకంగా జరిగాయి. ఏమైనా అక్రమాలు జరిగి ఉంటే విచారణలో తేలుతుంది. –వసుంధరాదేవి, ప్రిన్సిపల్, మెడికల్ కళాశాల

గ్రంథాలయ సెస్ బకాయిలపై ప్రత్యేక దృష్టి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ శారద



గ్రంథాలయ భవనాలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ శారద

కోవూరు : జిల్లా గ్రంథాలయ సంస్థకు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.69.69 కోట్ల సెస్ బకాయిలు రావాల్సి ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద తెలిపారు. కోవూరులో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవనాన్ని గ్రంథాలయ జిల్లా కార్యదర్శి కుమార్ రాజాతో కలిసి ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరు కార్పొరేషన్ నుంచి రూ.32.69 కోట్ల గ్రంథాలయ సెస్ బకాయిలు రావాల్సి ఉందన్నారు. మిగిలిన మున్సిపాలిటీలు, పంచాయతీల నుంచి మరో రూ.37 కోట్లు రావాల్సి ఉందన్నారు. ఉదయగిరి, జలదంకి, కోవూరులో నూ తన గ్రంథాలయ భవన నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో గ్రంథాలయాలకు మొత్తం 122 మంది ఉద్యోగులు కావాల్సి ఉండగా, ప్రస్తుతం 40 మంది మాత్రమే ఉన్నారన్నారు. దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ జె.సురేంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

పాఠశాలలను శుభ్రంగా ఉంచుకోవాలి



విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

- ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచన

వెంకటాచలం: పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ సూచించారు. మండలంలోని నిడిగుంటపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం కలెక్టర్ తనిఖీ చేశారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని తెలిపారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేస్తోందని వివరించారు. అందుకనుగుణంగా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగపరుచుకోవాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని, యూనిఫాం, బూట్లు తప్పనిసరిగా వేసుకోవాలని తెలిపారు. విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు పెంపొందించేలా పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కలెక్టర్ వెంట డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి, తహసీల్దార్ నరేష్, ఎంఈఓలు మధుసూదన్, శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు చలపతి ఉన్నారు.

సేవకుడిగా జగనన్న పాలన



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: తన సుదీర్ఘ పాదయాత్రలో జగన్‌మోహన్ రెడ్డి ప్రజల కష్టాలు చూసి, కన్నీళ్లు తుడిచారు. అధికారంలో వచ్చిన మొదటి రోజు నుంచే పాలకుడిగా కాకుండా సేవకుడిగా పాలన సాగిస్తున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి పట్టణంలోని 19వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందిన సంక్షేమ పథకాల వివరాలు తెలియజేసే బుక్‌లెట్‌లను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆర్థికంగా నిలుదొక్కుకునేలా సంక్షేమ పథకాలు ఇంటి దగ్గరకే అందేలా చేశామన్నారు. నవరత్నాల పథకాలు ప్రకటించినప్పుడు వాటిని అమలు చేయరని టీడీపీ నేతలు హేళన చేశారని, వారి హయాంలో ఒక్క ఇంటి పట్టా కూడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. కేవలం జగనన్న మాత్రమే పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి మాట నిలబెట్టుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కుప్పంతో సహా 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమైందని ధీమా వ్యక్తం చేశారు. లోకేష్ 3 వేల కి.మీ. పాదయాత్ర ఎక్కడ చేశాడో ఎవరికీ తెలియదని, వైఎస్ జగన్ చేసిన ప్రజాసంకల్పయాత్ర ప్రజల సమక్షంలో సమస్యలకు పరిష్కారం చూపేందుకు దోహద పడిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు పందిటి కామరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



44వ డివిజన్ పరిధిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనిల్

నారాయణవి డూప్ రాజకీయాలు

• సిటీ ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నాలుగున్నరేళ్ల తరువాత నారాయణ వచ్చి నెల్లూరులో అభివృద్ధి జరగలేదని మాట్లాడడం హాస్యాస్పదమని, ఆయన డూప్ రాజకీయాలను నమ్మే పరిస్థితి లేదని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ అన్నారు. నగరంలోని 44వ డివిజన్ లీలామహల్ సెంటర్‌లో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డుకు ఎమ్మెల్యే అనిల్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీలామహల్ రోడ్డులో ట్రాఫిక్ ఎక్కువగా ఉండడంతో రోడ్డు దెబ్బతినిందని, దీంతో దారిని కొద్దిగా వెడల్పు చేసుకుని మధ్యలో డివైడర్ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. దీంతో పాటు మైపాడు రోడ్డును నాలుగు లేన్‌లుగా మార్చడం, హరనాథపురం సెంటర్‌లో ఫ్లైఓవర్, పెన్నా బ్యారేజీ పనులు పూర్తికావడం ఈ విధంగా అనేక అభివృద్ధి పనులు జరిగాయని, ఇవి నారాయణకు కనబడడం లేదన్నారు. తుఫాను వచ్చినప్పుడు తాను ఎక్కడికీ వెళ్లలేదని టీడీపీ నేతలు అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వర్షాల వల్ల నీట మునిగిన ప్రాంతాల్లో ఒక్కరోజైనా పర్యటించని నారాయణకు అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. నీట మునిగిన ప్రాంతాల్లో దాదాపు మూడు వేల కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందినట్లు వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు తుఫాన్ బాధితులకు జరిగిన సాయంపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. టీడీపీ నేతలు డివిజన్‌లలో పర్యటిస్తూ ఫొటో షూట్‌లకు మాత్రమే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఖలీల్‌అహ్మద్, కార్పొరేటర్ నీలి రాఘవరావు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో ఉపాధి అవకాశాలు



ఐటీఐ కళాశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట : ప్రస్తుత పోటీ ప్రపంచంలో పారిశ్రామిక నైపుణ్యాభివృద్ధి శిక్షణతో అధిక సంఖ్యలో ఉపాధి అవకాశాలు పొందవచ్చని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ఏఎస్‌పేట మండలం హసనాపురంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల నూతన భవన సముదాయాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన ఏఎస్‌పేటలో విద్యార్థులకు ఇలాంటి కళాశాల అవసరమనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.6.76 కోట్లతో ఈ భవన సముదాయాన్ని నిర్మించిందని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చదువుకున్న ప్రతి విద్యార్థి మన రాష్ట్రంలోనే ఉంటూ ప్రగతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి కోసం నూతన పరికరాలతో వర్క్‌షాపును ఏర్పాటు చేసినట్లు వివరించారు. దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు హసనాపురం వచ్చి చదువుకునేలా ప్రోత్సహిస్తామని, రాబోయే రోజుల్లో పారిశ్రామికాభివృద్ధి, నైపుణ్యం కలిగిన విద్యార్థులు అవసరమన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, జేసీఎస్ కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి, రాజవోలు సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు సంధాని, వైఎస్సార్‌సీపీ నేతలు నరసింహారెడ్డి, కోటిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కొండారెడ్డి, రవీంద్రారెడ్డి, రియాజ్ అహ్మద్, జిలాని పాల్గొన్నారు.

నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.25
సన్నవి : రూ.17
పండ్లు : రూ.5



పౌల్ట్రీ ధరలు

బ్రాయిలర్:	రూ.115
లేయర్	రూ.100
బ్రాయిలర్ చికెన్:	రూ.206
స్కిన్‌లెస్ చికెన్:	రూ.226
లేయర్ చికెన్:	రూ.170



దాడి చేసి.. నగల బ్యాగ్ దోపిడీ



బాధితుడిని విచారిస్తున్న ఇన్‌స్పెక్టర్ కల్యాణ్‌రాజు, ఎస్సై

నెల్లూరు(క్రైమ్): ఓ ఇంట్లో వృద్ధ దంపతులు కుదువ దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని దుండగులు గమనించి పక్కా రెక్కీ వేసి ఇంట్లోకి చొరబడి దంపతులపై దాడి చేసి నగల బ్యాగ్‌తో ఉడాయించారు. ఈ ఘటన నగరంలోని దేవిరెడ్డివారి వీధిలో బుధవారం రాత్రి కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే.. దేవిరెడ్డివారి వీధిలో గేమ్‌చంద్‌జైన్, విమలాబాయి దంపతులు నివాసం ఉంటున్నారు. వారి కుమార్తెకు వివాహమై బారకాసు సెంటర్లో ఉంటున్నారు. గేమ్‌చంద్ ప్రస్తుతం వాకర్ సహాయంతో నడుస్తున్నారు. బుధవారం రాత్రి 8.35 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని దుండగుడు మొదటి అంతస్తులో ఉంటున్న గేమ్‌చంద్‌జైన్ ఇంటికి వచ్చాడు. కుదువ వస్తువును విడిపించుకునేందుకు వచ్చానని చెప్పడంతో వృద్ధుడు తలుపు తీయగా దుండగుడు లోపలికి ప్రవేశించి వృద్ధ దంపతులపై దాడి చేసి నోట్లో గుడ్డలు కుక్కాడు. ఈ క్రమంలో మరో ఇద్దరు దుండగులు ఇంట్లోకి ప్రవేశించి, హాలులోని లాకర్‌ను తెరిచి అందులో ఉన్న నగల బ్యాగ్‌ను తీసుకున్నారు. చేతికి వేసుకున్న గ్లౌజ్‌లను ఇంట్లోనే వదిలి పరారయ్యారు. కొద్దిసేపటికి దంపతులు తేరుకుని పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంతపేట ఇన్‌స్పెక్టర్ కల్యాణ్‌రాజు, ఎస్సై వేణుగోపాల్ ఘటనా స్థలానికి చేరుకుని దోపిడీ జరిగిన తీరును పరిశీలించారు. అయితే ఈ ఘటనలో ఎంత సొత్తు అపహరణకు గురైందో దంపతులు చెప్పలేకపోయారు. ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌లు ఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్నాయి. ఘటనా స్థలాన్ని నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. దోపిడీ అనంతరం దుండగులు ఓ బ్యాగ్‌తో పరారవుతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. నిందితులు సుమారు 35 ఏళ్లలోపు వారేనని తెలుస్తోంది.

ఆటోను ఢీకొన్న ఇసుక ట్రాక్టర్



తీవ్రంగా గాయపడిన ఆశీష్

కొడవలూరు : ఆటోను ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టగా ఐదుగురు స్వల్పంగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని నార్తురాజుపాళెం వెంకటేశ్వర కళాశాల వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రాచర్లపాడు సమీపంలో ఉన్న జీఆర్‌ఐ పైపుల ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు విధులు ముగించుకుని తిరిగి నార్తురాజుపాళెనికి ఆటోలో వస్తుండగా ఎదురుగా వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడడంతో అందులోని ఆరుగురు కార్మికులు గాయపడ్డారు. వారిలో ఆశీష్(30)కు తీవ్రగాయం కాగా, మిగిలిన ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. ఆశీష్‌ను నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన వారు ప్రథమ చికిత్స అనంతరం కోలుకున్నారు. ఈ కార్మికులంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కాగా, నార్తురాజుపాళెంలో ఉంటూ ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. ఈ మేరకు ఎస్సై కె.వీరప్రతాప్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగ యువతిపై లైంగికదాడి

- మనస్తాపంతో ఆమె ఆత్మహత్యాయత్నం
- పోలీసుల అదుపులో నిందితుడు

పొదలకూరు: దివ్యాంగ యువతి(22)పై ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడగా బాధితురాలి ఆత్మహత్యా యత్నంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన పొదలకూరు సమీపంలోని కేఆర్‌ఆర్ నగర్‌లో బుధవారం వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు.. బాధితురాలు తన నానమ్మ ఇంటికి వెళ్లి తిరిగి ఒంటరిగా వస్తుండగా నిందితుడు పేరిచర్ల పవన్‌కుమార్(26) ఆమెను పనిఉందని పిలిచాడు. పరిచయం ఉన్న వ్యక్తి కావడంతో అతని వద్దకు యువతి వెళ్లగా వెంటనే తలుపులు మూసి బాధితురాలిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం బయటకు చెబితే చంపుతానని బెదిరించాడు. దీంతో జరిగిన ఘోరాన్ని యువతి తల్లికి వివరించి, మనస్తాపంతో నెయిల్ పాలిష్ తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన తల్లిదండ్రులు పొదలకూరు సీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయిస్తున్నారు. నిందితుడు పవన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌చార్జి ఎస్సై మస్తానయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా

• వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో రసూల్ మృతదేహం

మర్రిపాడు : మండలంలోని ఏపిలగుంట గ్రామానికి సమీపంలో టమోటా లోడుతో వెళ్తున్న ఆటో బోల్తా పడడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు వివరాల మేరకు. ఉదయగిరికి చెందిన షేక్ రసూల్(51) కూరగాయల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ప్రతిరోజూ బద్వేలు నుంచి కూరగాయలను తీసుకొచ్చి వ్యాపారం చేస్తుంటారు. ఇదే క్రమంలో మంగళవారం బద్వేలు నుంచి గండిపాళేనికి తన ఆటోలో టమోటా లోడుతో బయలుదేరాడు. రాత్రి ఒంటి గంట సమయంలో ఏపిలగుంట సమీపానికి వచ్చే సరికి ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు సంతానం. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్చరిక నోటీసు

ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి కొండా శంకరరెడ్డి & మహాలక్ష్మమ్మ ఆర్ట్స్ & సైన్స్ కాలేజి కమిటీ, నార్తురాజుపాళెంకి చెందినది. సదరు కాలేజి కమిటీ తే 09-07-2021 దిన స్పెషల్ జనరల్ బాడీ మీటింగు ద్వారా రిజల్యూషన్ ప్లాను చేసి కమిటీని రద్దు చేస్తూ సదరు సొసైటీకి చెందిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని సింహపురి వైద్య సేవా సమితి, సోమశేఖరపురం, నెల్లూరు ట్రస్టుకు బదిలీ చేయడం జరిగినది. సదరు కమిటీ తే 26-07-2021 దిన లెటరు ద్వారా డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, నెల్లూరు వారికి సదరు ట్రాన్స్‌ఫర్ విషయం తెలియచేయడం జరిగినది. సింహపురి వైద్య సేవా సమితి, సోమశేఖరపురం, నెల్లూరు వారు తే 26-07-2021 దిన రిజల్యూషన్ ప్లాను చేసి కొండా శంకరరెడ్డి & మహాలక్ష్మమ్మ ఆర్ట్స్ & సైన్స్ కాలేజి కమిటీ వారు బదిలీ చేసిన ఆస్తులను తీసుకొనుటకు అంగీకరించడం జరిగినది. సదరు రిజల్యూషన్ కాపీని డిస్ట్రిక్ట్ రిజిస్ట్రారు, నెల్లూరు వారికి లెటరు ద్వారా తే 28-07-2021 దిన తెలియచేయడం జరిగినది. శ్రీమతి కాటంరెడ్డి శ్రీకుమారి అను ఆమెకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిలో ఎటువంటి హక్కు లేకపోయినప్పటికీ మరియు కొండా శంకరరెడ్డి & మహాలక్ష్మమ్మ ఆర్ట్స్ & సైన్స్ కాలేజి కమిటీ లో ఎటువంటి సంబంధం లేకపోయినప్పటికి S.R.O.P.No.245/2005 కేసుని 6వ అదనపు జిల్లా కోర్టు, నెల్లూరు నందు వేయడం జరిగినది. సదరు కేసును 06-11-2018న కోర్టు వారు కొట్టివేయడం జరిగినది. సదరు కాటంరెడ్డి శ్రీకుమారి గారు O.S.No.109/2007 ను ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, నెల్లూరు వారి కోర్టులో కాటంరెడ్డి శ్రీకుమారి గారిని కొండా శంకరరెడ్డి & మహాలక్ష్మమ్మ & సైన్స్ కాలేజి కమిటీ యొక్క జీవితకాలపు సెక్రటరీ మరియు కరస్పాండెంటుగా డిక్లేరు చేయమని కేసు వేయడం జరిగినది. సదరు కేసును కోర్టు వారు తే 02-02-2009న కొట్టి వేయడం జరిగినది. సదరు డిక్రీ మీద శ్రీమతి కాటంరెడ్డి శ్రీకుమారి గారు అప్పీలు కేసు A.S.No.51/2009 ను 1వ అదనపు జిల్లా కోర్టులో వేయడం జరిగినది. సదరు అప్పీలును కోర్టు వారు 04-07-2016 న కొట్టివేయడం జరిగినది. ఇట్టుండుటలో శ్రీమతి కాటంరెడ్డి శ్రీకుమారి గారు రెవెన్యూ రికార్డులను సృష్టించి ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని తనదిగా పేర్కొంటూ ఇతరులకు అన్యాక్రాంతం చేయుటకు ప్రయత్నిస్తున్నట్లుగా తెలుస్తున్నది. ప్రస్తుతం షెడ్యూలు దాఖలా ఆస్తిపై సర్వహక్కులు సింహపురి వైద్య సేవా సమితి, నెల్లూరు వారికి మాత్రమే చెందివున్నది. ఇతరులకు ఎటువంటి హక్కులు లేవు. ఆస్తిపై ఎటువంటి లావాదేవీలు జరిపిననూ సింహపురి వైద్య సేవా సమితి, నెల్లూరు వారి పై బద్ధగించవు మరియు సింహపురి వైద్య సేవా సమితి, నెల్లూరు వారు తీసుకొనబోవు సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు.

షెడ్యూలు

SPSR నెల్లూరు జిల్లా, నెల్లూరు డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్, కోవూరు సబ్‌రిజిస్ట్రేషన్, నార్తురాజుపాళెంకు చెందిన కొడవలూరు మండలంలోని పట్టా నెం.114 మరియు సర్వే నెం.258/1, 258/2 మరియు 258/3 కు చెందిన 4 ఎకరాల 34 సెంట్లు యొక్క హద్దులు. తూర్పు : పాత జాతీయ రహదారి, దక్షిణం: ప్రైవేటు స్థలం, పడమర: పంచాయతీ దొంక, ఉత్తరం : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కౌంటరు సంతకం
దామా ధమరేశ్వర్
న్యాయవాది, నెల్లూరు

ఇట్లు
శ్రీ నాగారెడ్డి హరికుమార్‌రెడ్డి
ప్రధాన కార్యదర్శి, సింహపురి వైద్య సేవా సమితి, నెల్లూరు.

విధివంచితకు ఉద్యోగం



మంత్రి కాకాణికి కృతజ్ఞతలు తెలుపుతున్న సుజన


పొదలకూరు : రోడ్డు ప్రమాదంలో కాలుపోగొట్టుకున్న యువతిని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదుకుని ఉద్యోగం కల్పించారు. మండలంలోని ముదిగేడు గ్రామానికి చెందిన ఎం.సుజన 2014 నవంబర్‌లో పొదలకూరు నుంచి గ్రామానికి ఆటోలో వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. అయితే ఆమె కాలికి శస్త్రచికిత్స చేసిన వైద్యుడి నిర్లక్ష్యం వల్ల కాలు కోల్పోవాల్సి వచ్చింది. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్న కాకాణి ఆమెలో మనోధైర్యం నింపి న్యాయపోరాటం చేసి వైద్యుని వద్ద నుంచి రూ.12 లక్షల నగదును ఇప్పించారు. అంతటితో ఆగకుండా ఆమె ఎంబీఏ పూర్తి చేసేందుకు సహకరించారు. చదువుకున్న సుజనకు నెల్లూరు కార్పొరేషన్లో కంప్యూటర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం కల్పించారు. దీంతో సుజన సంతోషానికి అవధుల్లేకుండాపోయాయి. ఫలితంగా ఆమె బుధవారం మంత్రి కాకాణిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పాముకాటుకు వ్యక్తి మృతి

గుడ్లూరు : పాము కాటుకు వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని చేవూరులో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన యాకసిరి వెంకయ్య(50) పొలాల వద్ద ఉన్న నేల బావి నుంచి వాటర్ ట్యాంక్‌కు నీరు పట్టేందుకు వెళ్లగా అక్కడ పాము కాటు వేసింది. దీంతో అతన్ని కావలిలోని ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
నెల్లూరు
గురువారం ॥ 14-12-2023

పర్యావరణం



శిలాజ ఇంధనాలను అంతం చేయండి... భవిష్యత్తును, భూగోళాన్ని కాపాడండి.
– లిసిప్రియ

నిండు సభలో... నిగ్గదీసి అడిగిన అగ్నిస్వరం

వాన కురిస్తే, హరివిల్లు విరిస్తే మురిసే చిన్నారి హృదయాలకు ప్రకృతి ఆత్మీయ నేస్తం. అలాంటి అందమైన, ఆత్మీయమైన ప్రకృతి ఎదుట విలయ విధ్వంసం కరాళనృత్యం చేస్తుంటే... లిసిప్రియలాంటి చిన్నారులు 'పాపం, పుణ్యం ప్రపంచ మార్గం' అని ఊరుకోరు. ప్రకృతికి సంబంధించి మనం చేస్తున్న పాపం ఏదో, పుణ్యం ఏదో కళ్లకు కట్టేలా ప్రచారం చేస్తారు. దుబాయ్‌లో జరిగిన 'యునైటెడ్ నేషన్స్ క్లైమెట్ చేంజ్ కాన్ఫరెన్స్-2023'లో తన నిరసనను బహిరంగంగా తెలియజేసింది మన దేశానికి చెందిన పన్నెండు సంవత్సరాల లిసిప్రియ కంగుజామ్. 'శిలాజ ఇంధనాలను అంతం చేయండి... భవిష్యత్తును, భూగోళాన్ని కాపాడండి' అంటూ నినదించింది. కొద్దిసేపు ప్రసంగించింది. ఆమె నిరసనను ప్రపంచ ప్రతినిధులు కొందరు చప్పట్లతో ఆమోదం పలికారు. ప్రపంచ దృష్టిని ఆకర్షించిన మణిపుర్‌కు చెందిన క్లైమెట్ యాక్టివిస్ట్ లిసిప్రియ గురించి....

లిసిప్రియ కంగ్‌జామ్ మణిపుర్‌లోని బషిక్‌హోంగ్‌లో జన్మించింది. తల్లిదండ్రుల ద్వారా, స్కూల్లో ఉపాధ్యాయుల ద్వారా విన్న పర్యావరణపాఠాలు ఈ చిన్నారి మనసుపై బలమైన ప్రభావాన్ని చూపాయి. పర్యావరణ సంరక్షణ కోసం తన వంతుగా ఏదైనా చేయాలనుకుంది. ఏడు సంవత్సరాల వయసులోనే అందరూ ఆశ్చర్యపడేలా పర్యావరణ సంబంధిత విషయాలు మాట్లాడేది.

నా నేరం ఏమిటి?

నిరసన తరువాత అధికారులు నన్ను 30 నిమిషాలకు పైగా నిర్బంధించారు. నేను చేసిన నేరం ఏమిటంటే పర్యావరణ సంక్షోభానికి ప్రధాన కారణం అయిన శిలాజ ఇంధనాలను దశల వారీగా తొలగించమని అడగడం. నన్ను 'కాప్ 28'లో లేకుండా చేశారు.

– లిసిప్రియ, యాక్టివిస్ట్

యాక్ట్ నౌ

దుబాయ్‌లో జరిగిన క్లైమేట్ కాన్ఫరెన్స్-2023లో 190 దేశాల నుంచి 60,000 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. చిన్నారి ప్రియ ధైర్యంగా వేదిక మీదికి వచ్చి 'అవర్ లీడర్స్ లై. పీపుల్ డై' అని గట్టిగా అరిచింది. సదస్సు ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆ తరువాత ప్రేక్షకుల నుంచి ప్రశంసలు లభించాయి.

'ఎవరు ఈ అమ్మాయి?' అంటూ చాలామంది ఆరా తీశారు. చిన్న వయసు నుంచే పర్యావరణ ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహిస్తున్న ప్రియ గురించి తెలుసుకొని ఆశ్చర్యానందాలకు గురయ్యారు.

2018లో ప్రకృతి విధ్వంసంపై మంగోలియాలో ఐక్యరాజ్య సమితి నిర్వహించిన సదస్సులో తండ్రితో కలిసి పాల్గొంది. ఈ సదస్సులో వక్తల ఉపన్యాసాల నుంచి ఎన్నో కొత్తవిషయాలు నేర్చుకుంది.

ఈ సదస్సు ప్రియ జీవితాన్ని మార్చేసిన సదస్సు అని చెప్పవచ్చు.

ఈ సదస్సు స్ఫూర్తితో 'చైల్డ్ మూమెంట్' అనే సంస్థను మొదలుపెట్టింది. మొక్కల పెంపకం వల్ల ప్రకృతికి జరిగే మేలు, ప్రకృతి విధ్వంసం వల్ల జరిగే నష్టాలు... మొదలైన వాటి గురించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎన్నో స్కూల్స్‌లో ప్రచారకార్యక్రమాలు విరివిగా నిర్వహించింది.

2019లో స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో జరిగిన యునైటెడ్ నేషన్స్ క్లైమేట్ ఛేంజ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొంది. ఇదే సంవత్సరం అంగోలా దేశంలో జరిగిన ఆఫ్రికన్ యూనియన్ సదస్సులో పాల్గొంది. ఈ సదస్సులో ఎంతోమంది దేశాధ్యక్షులతో పాటు ప్రియ ప్రసంగించడం విశేషం.

చిన్నవయసులోనే ఎన్విరాన్‌మెంటల్ యాక్టివిస్ట్‌గా ప్రపంచవ్యాప్తంగా పెద్ద పేరు తెచ్చుకుంది లిసిప్రియ.

ప్రియకు డబ్బులను పొదుపు చేయడం అలవాటు. అవి తన భవిష్యత్ అవసరాలకు ఉద్దేశించి కాదు. సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించడం కోసం పొదుపు చేస్తుంటుంది. 2018లో కేరళ వరద బాధితులకు సహాయంగా ముఖ్యమంత్రి సహాయనిధికి లక్షరూపాయలు విరాళంగా ఇచ్చింది. ఢిల్లీలోని వాయు కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని 'సర్వైవల్ కిట్ ఫర్ ది ఫ్యూచర్' అనే డివైజ్‌కు రూపకల్పన చేసింది. ఈ జీరో బడ్జెట్ కిట్ వాయుకాలుష్యాన్ని తగ్గిస్తుంది. ఎవరైనా, ఎక్కడైనా సులభంగా తయారు చేసుకోవచ్చు. ఈ పరికరాన్ని పంజాబ్ అసెంబ్లీలో లాంచ్ చేసింది ప్రియ. వాతావరణ మార్పులపై కార్యచరణ కోసం, మన దేశంలో క్లైమెట్ లా కోసం వందలాదిమందితో కలిసి ఢిల్లీలోని ఇండియా గేట్ దగ్గర ప్రదర్శన నిర్వహించింది.

'సందేశం ఇవ్వాలనుకోవడం లేదు. సమస్యను అర్థం చేసుకోమని చేతులు జోడించి వినమ్రంగా వేడుకుంటున్నాను' అంటుంది లిసిప్రియ.

న్యూస్‌మేకర్
ఆషిక్



కుమారునికి వంట నేర్పితే?

ఏమవుతుంది?

బహుశా 'మాస్టర్ చెఫ్' విజేతగా 25 లక్షలు ఇంటికి తీసుకొస్తాడు. అబ్బాయిలు వంట గదిలోకి వస్తే 'ఏంట్రా ఆడపిల్లలాగా' అని మందలిస్తారు. కాని వంట స్త్రీలకూ, పురుషులకూ రావాలి. పిల్లలు ఎంత బాగా చదువుకున్నా వారికి కొద్దో గొప్పో వంట తెలిసుండాలి. 'మాస్టర్ చెఫ్' తాజా విజేత ఆషిక్ మా అమ్మ నేర్పిన వంట వల్లే గెలిచాను అన్నాడు. మంగళూరులో చిన్న జ్యూస్ షాప్ నడుపుకునే ఆషిక్ ఇంత పెద్ద గెలుపుతో ప్రపంచాన్ని ఆకర్షించాడు.

'సోనీ లివ్' చానల్ వారి ప్రఖ్యాత రియాలిటీ షో 'మాస్టర్ షెఫ్' సీజన్ 8 ఆడిషన్స్ రౌండ్‌లో ఆషిక్ చేసిన మంగళూరు స్టయిల్ ఫిష్ ఫ్రైను జడ్జీలు వెంటనే ఓకే చేయలేదు. 'కొంత బాగుంది కొంత బాగలేదు. మళ్లీ చెప్తాం' అన్నారు. కాని ఆ తర్వాత ఆషిక్‌కు అవకాశం ఇచ్చారు. అప్పటినుంచి అంటే అక్టోబర్ 18 నుంచి డిసెంబర్ 8 ఫైనల్స్ వరకూ ఆషిక్ చేసిన వంటకాల ప్రయాణం ఉద్వేగభరితంగానే సాగింది. ఎందుకంటే అతడు వంటను శాస్త్రోక్తంగా నేర్చుకోలేదు. అమ్మ దగ్గర ఇంట్లో వంటగదిలో నేర్చుకున్నాడు.

24 ఏళ్ల కుర్రాడు

మంగళూరుకు చెందిన ఆషిక్ వయసు 24 ఏళ్లు. దిగువ మధ్య తరగతి కుటుంబం. ఇంటర్ తర్వాత హోటల్ మేనేజ్‌మెంట్ చేద్దామనుకున్నాడు. కాని ఫీజు కట్టే పరిస్థితి లేక కట్టలేదు. ఏం చేయాలి. వంట బాగా వచ్చు. యూ ట్యూబ్‌లో చూసి రకరకాల వంటకాలు చేయడం నేర్చుకున్నాడు. దానికి కారణం చిన్నప్పటి నుంచి అతని ఆటలన్నీ వంట గదిలోనే సాగేవి. నానమ్మ వంట చేస్తుంటే అక్కడే కూచుని చెంబులు తప్పేళాలతో ఆడుకునేవాడు. అమ్మ హయాం వచ్చేసరికి వంటలో సాయం పట్టడం మొదలెట్టాడు. తల్లి – 'ఏమిటీ ఆడంగి పనులు' అని తిట్టకుండా కొడుకును ప్రోత్సహించింది. ఇంటికి ఎవరొచ్చినా ఆషిక్ వంట చేసే పద్ధతి చూసి ఆశ్చర్యపోయేవారు. ఆ ఆత్మవిశ్వాసంతో మంగళూరులో 'కులుక్కి' పేరుతో చిన్న జ్యూస్ షాప్ పెట్టాడు ఆషిక్. అయితే అది సగటు జ్యూస్‌షాప్ కాదు. ఆషిక్ కనిపెట్టిన రకరకాల ఫ్లేవర్లు, మిక్స్‌డ్ కాంబినేషన్లు అందులో దొరుకుతాయి. జనం బాగా కనెక్ట్ అయ్యారు. అతని జ్యూస్ షాప్ మంచి హిట్. కాని ఇంకా జీవితంలో సాధించాలి అంటే ఏదైనా పెద్దగా చేయాలనుకున్నాడు ఆషిక్. 'మాస్టర్ షెఫ్' అందుకు వేదికగా నిలిచింది.

విఫలమైనా ముందుకే

2022 మాస్టర్ షెఫ్ ఆడిషన్స్‌కు వచ్చిన ఆషిక్ రిజెక్ట్ అయ్యాడు. 'చాలా డిప్రెషన్‌లోకి వెళ్లాను. మళ్లీ ఏమీ వండలేననే అనుకున్నాను. కాని సాధించాలి... మనసుపెట్టి పోరాడాలి అని నిశ్చయించుకున్నాను. 2023 ఆడిషన్స్ వచ్చేవేళకు చాలా కష్టపడి తర్ఫీదు అయ్యాను సొంతగా. షో ముందుకు వెళ్లేకొద్దీ సవాళ్లు ఎదురైనా ఛేదిస్తూ విజేతగా నిలిచాను' అన్నాడు ఆషిక్.


తల్లితో ఆషిక్

ఫైనల్స్ ఎపిసోడ్‌లో ఆషిక్ తల్లిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆమె సమక్షంలోనే ఆషిక్‌ను విజేతగా ప్రకటించారు. కొడుకు విజేత అవుతాడో లేదోనని ఆమె ఉత్కంఠగా ఎదురు చూసింది. ఆపై కొడుకు విజయానికి పులకించిపోయింది.

కాగా ఈ సీజన్‌లో మేఘాలయాకు చెందిన స్కూల్ ప్రిన్సిపల్ నంబి మొదటి రన్నర్ అప్‌గా, జమ్ము-కశ్మీర్‌కు చెందిన రుక్సర్ అనే ఫుడ్ టెక్నిషియన్ సెకండ్ రన్నర్ అప్‌గా నిలిచారు. ప్రసిద్ధ షెఫ్‌లు వికాస్ ఖన్నా, రణ్‌వీర్ బ్రార్, గరిమా అరోర జడ్జీలుగా వ్యవహరించారు. రొయ్యలతో ఆషిక్ చేసిన 'క్రిస్పీ ప్యారడైజ్' అనే వంటకాన్ని రుచి చూసిన జడ్జ్ రణ్‌వీర్ బ్రార్ తన సంతకం కలిగిన కిచెన్ నైఫ్ బహూకరించడం విశేషం.

హోటల్ రంగంలోగాని, స్వయం ఉపాధికిగాని పాకశాస్త్రం నేడు చాలా అవసరంగా ఉంది. మంచి షెఫ్‌లకు చాలా డిమాండ్ ఉంది. అదెలా ఉన్నా తెల్లారి లేస్తే మూడుపూట్లా తినాలి కనుక, వంట కేవలం ఆడవారి వ్యవహారం అనే భావన పోయి, ఇకమీదైనా అబ్బాయిలకు తల్లులు కనీసం అవసరమైనంత వంట నేర్పడం మంచిది. ఏమో... వారు ఇంకా బాగా నేర్చుకుంటే మరో మాస్టర్ షెఫ్ అవుతారేమో. ఏ ప్లేట్‌కు ఏ పదార్థం రాసి పెట్టుందో ఎవరు (రుచి) చూసొచ్చారు కనుక.

కిచెన్‌టిప్స్

కరకరలాడాలంటే...

బిస్కెట్లు మెత్తగా అవ్వకుండా కరకరలాడాలంటే ఇలా చేసిచూడండి...

- ప్లాస్టిక్, అల్యూమినియం డబ్బాలు, గాజు పాత్రల్లో బిస్కెట్లు, కుకీలను నిల్వచేయాలి. గాలి చొరబడకుండా పెడితే ఎక్కువరోజులపాటు క్రిస్పీగా ఉంటాయి.
- డబ్బాల్లో నిల్వచేసేటప్పుడు అడుగు భాగంలో రెండు మూడు వరుసల్లో టిష్యూపేపర్లు వేసి తరువాత బిస్కెట్లు పెట్టాలి. బిస్కెట్లపైన మరో రెండు వరుసల్లో టిష్యూపేపర్లు వేసి పైన బిస్కెట్లు పెట్టాలి. ఇలా నిండుగా పెట్టి గాలిచొరబడకుండా మూత పెట్టాలి.
- జిప్‌లాక్ పౌచ్‌లలో నిల్వచేస్తే కూడా కుకీలు తాజాగా ఉంటాయి.
- గాలి చొరబడని డబ్బాలు, జిప్‌లాక్ పౌచ్‌లను రిఫ్రిజిరేటర్‌లో పెడితే మరిన్ని రోజులు బిస్కెట్లు తాజాగా ఉంటాయి.
- అనుకోకుండా సరిగా నిల్వచేయనప్పుడు మెత్తబడిన కుకీలను అవెన్ లేదా ఎయిర్‌ఫ్రైయర్‌లో ఉంచి వేడి చేస్తే మళ్లీ క్రిస్పీగా మారతాయి. వీటిని కూడా నిల్వచేసుకోవచ్చు.



బ్యూటిప్స్ హెయిర్ కేర్

జుట్టుకు బలాన్నిచ్చే టానిక్

బీట్‌రూట్ ఒకటి తీసుకుని చెక్కు తీసి ముక్కలుగా తరగాలి. రెండు ఉసిరి కాయలను గింజలు తీసేసి ముక్కలుగా కోయాలి. వీటికి పన్నెండు రెమ్మల కరివేపాకు, గ్లాసు నీళ్లు కలపాలి. ఈ మిశ్రమాన్ని పదినిమిషాల పాటు మీడియం మంట మీద మరిగించాలి. చక్కగా మరిగాక దించేసి చల్లారిన తరువాత ఈ రసాన్ని వడగట్టి సీసాలో నిల్వచేసుకోవాలి. ఈ టానిక్‌ను వారానికి రెండు మూడుసార్లు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించాలి. రెండు గంటల తరువాత సాధారణ షాంపుతో కడిగేయాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే కుదుళ్లకు పోషకాలు అందుతాయి. రక్తప్రసరణ చక్కగా జరిగి జుట్టు ఊడడం తగ్గుతుంది. చివర్లు చిట్లకుండా చక్కగా పెరుగుతాయి.



జెల్ మెరుపులు

టేబుల్ స్పూను పంచదార పొడిలో స్పూను వేడి నీళ్లు పోసి కలపాలి. దీన్లో రెండు టీస్పూన్ల పచ్చి పాలు, స్పూను అలోవెరా జెల్ వేసి కలపాలి. శుభ్రంగా కడిగిన ముఖానికి ఈ మిశ్రమాన్ని రాసి మర్దన చేయాలి. పదినిమిషాలపాటు ఆరనిచ్చి కడిగేయాలి. వారానికి మూడు సార్లు ఈ ప్యాక్ వేయడం వల్ల చర్మానికి తేమ అంది, మృదువుగా నిగారింపుతో కనిపిస్తుంది.





- మరుగుతున్న రెండు గ్లాసుల నీటిలో మూడు టేబుల్ స్పూన్ల టీపొడి, పది గులాబీ పువ్వులు వేసి పదినిమిషాలపాటు మరిగించాలి. ఇది చల్లారిన తర్వాత వడగట్టి ఒక సీసాలో పోయాలి. తలస్నానం చేసిన జుట్టుకు ఈ డికాషన్‌ను పట్టించి, టవల్ చుట్టుకోవాలి. నీటితో కడగకూడదు. ఇది కండీషనర్‌లా పనిచేసి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.

హెల్త్‌కేర్ ఇండస్ట్రీలో మహిళలు తక్కువ ఆదాయాలను పొందే ఫ్రంట్‌లైన్ పాత్రలలోనే కనిపిస్తున్నారు అని దస్రా ఆర్గనైజేషన్ ఒక డేటా విడుదల చేసింది. మహిళలు వైద్యవిద్యలలో 29 శాతం ఉంటే, నర్సింగ్ సిబ్బందిలో 80 శాతం ఉన్నారు. ఇక 100 శాతం ఆశావర్కర్లుగా ఉన్నారు. ఆరోగ్య సంరక్షణలో నాయకత్వ స్థానాల్లో కేవలం 18 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. ఈ రంగంలో పురుషుల కంటే 34 శాతం స్త్రీలు తక్కువ సంపాదిస్తున్నారు.



* హెల్త్ కేర్ నివేదిక

'రోల్' లేదు 'మోడల్' లేదు!

హెల్త్‌కేర్‌లో మహిళలు ఫ్రంట్‌లైన్‌కే పరిమితం

లాభాపేక్ష లేకుండా, అన్ని రంగాలలో సామాజిక మార్పునకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థ దస్రా. ఈ సంస్థ హెల్త్ కేర్ రంగంపై దృష్టి పెట్టి, ఓ నివేదికను రూపొందించింది. ఈ నివేదికలో పొందుపర్చిన విషయాలలో ముఖ్యంగా గమనించాల్సింది మహిళలకు రోల్‌మోడల్స్ లేకపోవడం, వారి పనిని తక్కువ అంచనా వేయడం, అంతర్గత పక్షపాతాలు, లింగ సమానత్వం గురించి సరైన అవగాహన లేకపోవడం అని పేర్కొంది.

ఫ్రంట్‌లైన్ పాత్రలలోనే..

భారతదేశంలో ప్రధానమైన హెల్త్‌కేర్ రంగం కొన్ని సంవత్సరాలుగా సాంకేతికత, నైపుణ్యాలు, విద్య, వృత్తిపరంగా గణనీయమైన అభివృద్ధి, విస్తరణను చవిచూసింది. అయినప్పటికీ ఆరోగ్య సంరక్షణ రంగంలో మహిళలు తక్కువ ఆదాయాలను పొందే ఫ్రంట్‌లైన్ పాత్రలలో కనిపిస్తున్నారని దస్రా నివేదిక సూచిస్తుంది. దస్రా డైరెక్టర్ శైలజా మెహతా మాట్లాడుతూ 'ఆరోగ్య సంరక్షణ రంగంలో మహిళల నాయకత్వంలో మార్పు తీసుకురావడం చాలా అవసరం. ఎందుకంటే, ఇతర రంగాలను కూడా హెల్త్‌కేర్ ప్రభావితం చేయడమే కారణం. లింగ సమానత్వం విషయంలో మా పనిలో మేం మహిళల పురోగతికి సంబంధించిన గ్యాప్‌పై దృష్టి పెట్టాలనుకున్నాం' అని తెలిపారు.

అతి తక్కువ శాతం

నివేదిక ఫలితాల ప్రకారం మొత్తం హెల్త్‌కేర్ వర్క్ ఫోర్స్‌లో 54 శాతం ఉన్న ప్రైవేట్ హాస్పిటల్ సెక్టార్‌లో మహిళలు దాదాపు 25 నుంచి 30 శాతం నాయకత్వ స్థానాలను ఆక్రమించారు. ఫార్మాస్యూటికల్, బయోటెక్ రంగాలలో 5 నుంచి 10 శాతం మాత్రమే నాయకత్వపాత్రల్లో మహిళలు ఉన్నారు. మార్కెటింగ్ కార్యకలాపాల స్థానాల్లో కూడా మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. ప్రవేశ స్థాయి స్థానాల్లో మహిళలు 40 నుంచి 50 శాతం ఉండగా, సీనియర్ పాత్రలలో ఈ శాతం గణనీయంగా 15 నుంచి 20 శాతానికి పడిపోయింది.

పరిమిత ప్రాధాన్యం

మహిళలు ఆర్ అండ్ డి, నర్సింగ్, హెచ్‌ఆర్, పరిపాలన, నాణ్యత హామీ, చట్టపరమైన, నియంత్రణ వ్యవహారాలు వంటి విధుల్లో బాగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇవి పరిమిత ప్రభావాన్ని కలిగి ఉంటాయి. ముఖ్యంగా ఎంట్రీ లెవల్ హెచ్‌ఆర్ పాత్రల కోసం మహిళలకు ప్రాధాన్యత ఉంటుంది. దీని ఫలితంగా గణనీయంగా 70-80 శాతం ప్రాతినిధ్యం ఉంది. ఇదే నాయకత్వ స్థానాల్లో 20 నుంచి 30 శాతానికి పడిపోతుంది. నివేదిక ఫలితాలు, రోగుల సేవా బృందాలు, ఎఫ్ అండ్ బి మొదలైన వాటిలో ఇదే విధమైన నమూనాను గమనించాయి. ప్రవేశ స్థాయులలో 40 నుంచి 60 శాతం మహిళలను ప్రాధాన్యంగా నియమించుకుంటారు. అయితే సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ స్థాయులకు వారి పురోగతి పరిమితంగా ఉంది. ఇది 15 నుంచి 20 శాతానికి మాత్రమే చేరుకుంది.

రోల్ మోడల్స్ లేకపోవడమే..

లీడర్‌షిప్ క్వాలిటీ పెంపొందించుకోవడానికి మహిళలకు ప్రధాన అవరోధం రోల్ మోడల్స్ లేకపోవడమే. మహిళల పనిని తక్కువ అంచనా వేయడం, అంతర్గత పక్షపాతాలు, లింగ సమానత్వం, వైవిధ్యం గురించి నమ్మదగిన సాంస్కృతిక కథనం లేకపోవడం అని నివేదిక హైలైట్ చేసింది. శైలజా మెహతా మరిన్ని వివరాలు చెబుతూ 'అడ్డంకులు చాలా రెట్లు ఉన్నాయి. మహిళలు నిజంగా ప్రభావవంతంగా ఉన్నారా.. మంచి నాయకులు కాదా... అని ప్రశ్నించే మూస పద్ధతి కూడా ఒక కారణంగా ఉంది. మహిళల నాయకత్వానికి వ్యతిరేకంగా ప్రతికూల పక్షపాతాలు, నిబంధనలు, ప్రవర్తనలు, ఊహాజనితాలు ఎన్నో ఉన్నాయి. వీటిని వదులుకోవడం అంత సులభం కాదు. సంస్థలు మెరుగైన వ్యాపారం కోసం ఆలోచిస్తాయే తప్ప మహిళా ఉన్నతిని పెద్దగా పట్టించుకోవు. హెల్త్‌కేర్ రంగంలో మహిళలు లీడర్‌షిప్ స్థాయిలో ప్రాతినిధ్యం వహించడానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది. భారతదేశంలో చాలా మంది మహిళలకు వారి ఆకాంక్షలకు కఠినమైన అడ్డంకులు ఉంటాయి. మహిళల లక్ష్యం నర్సు కావడమే అన్నట్టుగా ఉంటుంది. మేనేజర్‌గా లేదా సీఇవోగా ఉండటానికి వారికి అవకాశం ఇవ్వరు.

'మహిళలు తమ పరిమితులను దాటి, విస్తరించాలి. అడ్డుగోడలను, నిబంధనలను తొలగించుకుంటూ తమను తాము ప్రోత్సహించుకుంటూ ముందడుగు వేయాలి. అప్పుడే భవిష్యత్తు తరాలకు రోల్‌మోడల్స్‌గా నిలుస్తారు' అని చెబుతున్న దస్రా నివేదిక మనందరినీ ఆలోచింపజేస్తుంది.